


31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

ఆదివారం, జూలై 12, 2026

పేజీలు : 8

అనునిత్యం విధులలో ఉండే పోలీసులకు

## క్రీడలు ఉత్సాహాన్ని కలిగిస్తాయి



**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి**
**-ఘనంగా ముగిసిన 4వ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 11:** అనునిత్యం విధులలో ఉండే పోలీసులకు క్రీడలు ఉత్సాహాన్ని కలిగిస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి అన్నారు. అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ జగిత్యాల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్--2026 ముగింపు కార్యక్రమం శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ఉత్సాహం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు విధి నిర్వహణలో మరింత సమర్థతను సాధించే లక్ష్యంతో నిర్వహించిన ఈ వార్షిక క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ హాజరై వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ట్రోఫీలు, పతకాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి రత్న పద్మావతి మాట్లాడుతూ పోలీసు శాఖ ప్రజల భద్రత కోసం ఇరవై నాలుగు గంటలూ సేవలందిస్తోందని, అలాంటి -2లో

## రైతుల మేలే ప్రజాప్రభుత్వ లక్ష్యం

**-రైతులందరికీ రైతు భరోసా నిధుల విడుదల**
**-బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం**
**-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**



**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 11:** రైతులకు మేలు చేయడమే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం లక్షమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా ధర్మపురి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో 90,761 రైతులకు రూ. 87.21 కోట్లు రైతు భరోసా వేయడం జరిగిందని అన్నారు. జగిత్యాల జిల్లాలో మొత్తం 2, 29,213 రైతులకు గాను రూ. 243.40 కోట్లు రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లాలోని 70,40,286 రైతుల గాను రూ 875. 96 కోట్లు రైతులకు ఖాతాలో జమ చేయడం జరిగిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి దూరంగా మారిందని అన్నారు. గోదావరి తీరాన ఉన్న ధర్మపురికి తాగునీటి సమస్యను తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో ఎలాంటి అనుమతి లేకుండానే రోడ్ల వాగు ప్రాజెక్టు నిర్మాణం పేరుతో కమిషన్లు దండుకున్నారని అక్క పల్లి ఎత్తిపోతల పథకాన్ని ఏనాడు పట్టించుకోలేదని ధర్మపురి పట్టణంలో ఏర్పాటు చేసిన మాతాశిశు సంక్షేమాన్ని కాంట్రాక్టర్ కి కనీసం బిల్లులు ఇవ్వలేదని మంత్రి ఆరోపించారు. ధర్మపురికి డిగ్రీ కళాశాల తీసుకురావడం జరిగిందని మంత్రి తెలిపారు. రూ.10కోట్ల సీఎస్ఆర్ నిధులు తీసుకువచ్చి భవన నిర్మాణం చేయడానికి చర్యలు తీసున్నామని మంత్రి అడ్లూరి అన్నారు. ధర్మపురి గోదావరి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగింద ని పవిత్ర నది స్థానానికి వచ్చే భక్తుల కోరకు గోదావరిలో మురుగు నీరు కలవకుండా సీవరేజ్ ప్లాంట్ నిర్మాణం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ధర్మపురి పట్టణంలో కుల సంఘాల భవనాలు నిర్మించడానికి నిధులు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని 149 గ్రామాల్లో అంగన్ వాడీ భవనాల నిర్మాణం, మహిళా సంఘాలకు వివో భవనాలు నిర్మాణం చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన చోట అదనపు తరగతి గదులు నిర్మాణం చేస్తూ ముందుకు సాగుతుందని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రతిపక్షాల నాయకులు కొందరు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో ని అభివృద్ధి లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. -2లో

## కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు 8 నెలలుగా కృషి చేస్తున్నా

**-పాత ఎస్పీ కార్యాలయంలో తాత్కాలికంగా తరగతులు**
**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 11:** జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గత 8 నెలలుగా కృషి చేస్తున్నామని, నేడు భూమి పూజ నిర్వహించనున్నామని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. శనివారం జగిత్యాల మోతె రోడ్డులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయింపులో కొంత ఆలస్యం జరిగిందని, వాలంతరి అనేది అటానమస్ సంస్థ అని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహజ వ్యవసాయంపై దృష్టి సారించడంతో అక్కడ స్థలం కేటాయింపు ఆలస్యమైందని వివరించారు. కేంద్రీయ విద్యాలయంతో పాటు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కూడా తక్కువ స్థలం కేటాయించారని గుర్తు చేశారు. దేశంలోని దాదాపు అన్ని జిల్లాలకు ఇప్పటికే కేంద్రీయ విద్యాలయాలు మంజూరు అయ్యాయని, ఇది సీబీఎస్ఈ పాఠశాల మాత్రమేనని, కొందరు దీనిని కేంద్రీయ విశ్వవిద్యాలయంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అరవింద్ ఎంపీగా గెలిచిన 7 సంవత్సరాలకు కేంద్రీయ విద్యాలయం మంజూరు అయిందని తెలిపారు. జగిత్యాలకు నవోదయ మంజూరు చేయాలని కోరగా కోరుట్లలో ఏర్పాటు చేశారని చెప్పారు.కేంద్రీయ విద్యాలయం డిప్యూటీ డైరెక్టర్, డీఈఓ, కలెక్టర్, కరీంనగర్ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ వచ్చి పాత ఎస్పీ కార్యాలయంలో పాఠశాల నిర్వహణకు -2లో

## గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం



**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 11:** గ్రామాల అభివృద్దే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం ధర్మపురి మండలంలోని నక్కలపేట్, దోనూర్, తీగలధర్మారం గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో సాగునీటి పరిస్థితులను పరిశీలిం చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీరు సకాలంలో అందేలా కెనాల్లను క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి, అవసరమైన మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి -2లో

## కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు 8 నెలలుగా కృషి చేస్తున్నా

**మొదటి పేజీ తరువాయి..** ఆమోదం తెలిపారన్నారు. 6 నెలల క్రితమే భవనం కేటాయించామని, చల్గల్‌లో 5 ఎకరాల భూమికి కలెక్టర్ అడ్వాన్స్ పొజిషన్ ఇచ్చారని వివరించారు. పూర్తిస్థాయి కేంద్రీయ విద్యాలయం కేటాయింపుకు క్యాబినెట్ ఆమోదం అవసరం కావడంతో మంత్రి లక్ష్మణ్ కుమార్ కూడా క్యాబినెట్‌లో ఆమోదం కోసం ప్రయత్నించారని, దీంతో నేడు భూమి పూజ చేస్తున్నామని చెప్పారు. కేంద్రీయ విద్యాలయం కోసం తాను చేసిన ప్రయత్నాలకు ఆధారాలు ఉన్నాయని, కొందరు పోరాటం చేశామని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. పాఠశాల భవనం త్వరగా పూర్తి చేసేందుకు ఎంపీ కృషి చేయాలని, రెగ్యులర్ సిబ్బందితో బోధన జరిగేలా చొరవ తీసుకోవాలని కోరారు. అభివృద్ధి పనుల విషయంలో తనకు ఎలాంటి బేషజాలు లేవని, మంత్రులు, ఎంపీతో కలిసి జగిత్యాల అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ముఖ్యమన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, కౌన్సిలర్లు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం

**మొదటి పేజీ తరువాయి..** ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. అనంతరం తీగలధర్మారం గ్రామంలో లబ్ధిదారురాలు నూతనమ్మ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి నాణ్యమైన గృహాలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ సంఘనబట్ల దినేష్, మండల కాంగ్రెస్ అద్యక్షుడు చిలుముల లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు కుంట సుధాకర్, మార్కెట్ వైస్ ఛైర్మన్ సంగ నర్సింహులు, సర్పంచ్లు పందిరి అశోక్, దాసరి పురుషోత్తం, నల్ల మల్లవ్వ, నాయకులు శ్రీహరి, మోగిలి శేఖర్, జంగిలి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### 26 వార్డులో జోరుగా "సర్"

**-సర్ పై అవగాహన కల్పించిన కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య**

**-ప్రత్యేకంగా "హెల్ప్ డెస్క్" ఏర్పాటు**



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్ జూలై 11:** హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని 26 వ వార్డులో శనివారం ఓటర్ లిస్ట్ ల ప్రత్యేక పున: పరిశీలన కార్యక్రమంలో భాగంగా వార్డు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య ఆధ్వర్యంలో "హెల్ప్ డెస్క్" శనివారం ఏర్పాటు చేశారు. పాత వెంకటేశ్వర టాకీస్ లో ఓటర్లకు సర్ పై అవగాహన కల్పించారు. సర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేటర్లకు ఇచ్చిన ఫారాలను ఈ నెల 24 వరకు ఫారం పూర్తి చేయాలని సూచించారు. సుమారు 120 మంది దరఖాస్తులను నింపి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వార్డు కు చెందిన 96 ఏళ్ల కురు వృద్ధులు, స్వతంత్ర సమరయోధులు కాళ్ళ నారాయణ తన సర్ దరఖాస్తు ఫారాన్ని నింపి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య మాట్లాడుతూ.. సర్ కార్యక్రమంపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 2002 ఓటర్ లిస్టులో ఉన్న ఓటర్ల లేదా కుటుంబ పెద్దల పేర్లను నమోదు చేయాలని, తదనంతరం సంబంధిత ఓటర్ వివరాలు కూడా నమోదు చేయాలని సూచించారు. సర్ ప్రతి 15 ఏళ్లకోసారి జరిగే కార్యక్రమం అని, ఓటర్లు తన వంతు కర్తవ్యం గా ఇందుకు సహకరించాలని లేకుంటే వారి ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, శక్తివంతమైనదని ప్రతి ఒక్కరూ తన ఓటు లిస్టులో ఉండేలా జాగ్రత్త వహించాలని కోరారు. ఎవరికైనా సర్ విషయంలో అనుమానాలు ఉంటే ఎన్యుమరేటర్లు నివృత్తి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ తిలక్, బీ ఎల్ ఓ అలివేలు తదితరులు పాల్గొన్నారు.

### అనునిత్యం విధులలో ఉండే పోలీసులకు

# క్రీడలు ఉత్సాహాన్ని కలిగిస్తాయి

**మొదటి పేజీ తరువాయి..** బాధ్యతాయుతమైన విధులు నిర్వహించే సిబ్బందికి శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత ఎంతో అవసరమన్నారు. ఎంతో పని ఒత్తిడితో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న పోలీస్ వారికి స్పోర్ట్స్ మీట్ అనేది చాలా అవసరమని ఈ యొక్క స్పోర్ట్స్ మీట్ వల్ల మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించవచ్చన్నారు. గెలుపు-- ఓటములను సమానంగా స్వీకరించి, క్రీడాస్ఫూర్తిని జీవితంలో ప్రతి రంగంలో అలవర్చుకోవాలని సూచించారు.రాబోయే రోజులో జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు మరింత ఉస్తానగా విధులు నిర్వహిస్తారని ఆశిస్తున్నానని అన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో ఈ క్రీడల్లో పాల్గొనడం ముఖ్యమన్నారు. ప్రతిరోజు విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఆటవిడుపుగా ఇలాంటి క్రీడా పోటీల లో పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పొందరని అన్నారు. కష్టపడితేనే క్రీడల్లోనైనా, ఏ వృత్తిలోనైనా ఫలితం ఉంటుందన్నారు. పోలీసులు విధుల్లో ఒత్తిడి నుంచి బయటపడడానికి, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. అన్ని క్రీడల్లో హోంగార్డు ఆఫీసర్ నుంచి అధికారుల వరకు మంచి పోటాపోటీ ని ఇస్తూ క్రీడాస్ఫూర్తిని కనబరచాలని అన్నారు. స్పోర్ట్స్ లో ఇన్వాల్వ్మెంట్ ద్వారా జీవితంలో లక్ష్యాలకు దగ్గరగా చేరుకోగలుగుతమని, ఈ స్పోర్ట్స్ మీట్ వల్ల ఉద్యోగుల్లో టీం వర్క్ అనేది ఏర్పడుతుందన్నారు. టీం వర్క్ వల్ల ఎప్పుడు విజయాలే కలుగుతాయని, ఈ స్పోర్ట్స్ మీట్ అనేది ఇంత విజయవంతం కావడానికి టీం వర్క్ ముఖ్య కారణమన్నారు. ఈయొక్క పోలీస్ స్పోర్ట్స్ మీట్ ను ఇంత ఘనంగా నిర్వహించడం లో కృషి చేసిన జిల్లా అదనపు ఎస్పీ, డీఎస్పీలు, మరియు వారి టీం ని జిల్లా ఎస్పీ అభినందించారు. క్రీడా పోటీలను నిర్వహించిన పిఈటిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్,సుధాకర్, కరుణాకర్, రాజకుమార్,లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, సైదులు,వేణు, ఎస్ఐ లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కల్గిస్తాయి



**చురకలు విలేకరి, కోరుట్ల, జూలై 11 :** క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కల్గిస్తాయని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ అన్నారు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో క్రీడలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, చిన్నతనం నుంచే విద్యార్థులు అథ్లెటిక్స్పై దృష్టి సారించాలని సూచించారు. అథ్లెటిక్స్ వ్యక్తిగత ప్రతిభను వెలికితీసే క్రీడ అని, ఇందులో గ్రూపు రాజకీయాలకు తావు ఉండదని పేర్కొన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే గుణాన్ని పెంపొందిస్తాయన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో 686 మంది క్రీడాకారులు పాల్గొనడం సంతోషకరమని, మారుమూల గ్రామాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తున్న క్రీడా ఉపాధ్యాయులను అభినందించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కేవలం డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని మాత్రమే కాకుండా మంచి క్రీడాకారులుగా కూడా తీర్చిదిద్దేందుకు ప్రోత్సహించాలని సూచించారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచి చిన్నప్పటి నుంచే క్రీడల వైపు ఆసక్తి పెంపొందిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టేది క్రీడాకారులేనని అన్నారు. కేరళ హైస్కూల్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్లు పతకాలు అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ పోటీల్లో 600, 800, 1500, 2000, 3000, 5000 మీటర్ల మిడిల్, లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన 40 మంది క్రీడాకారులను ఈ నెల 18న మెదక్ జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేసినట్లు ఏలేటి ముత్తయ్య రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల కోరుట్ల పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. భారి, స్థానిక వార్డు కౌన్సిలర్ సురేందర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గజల్లి రాందాస్, కోశాధికారి బి. కొమురయ్య, క్రీడా ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవి, శంకర్, గంగాధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్‌లో.. అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూలై 11:** హుజురాబాద్ పట్టణంలో ఓ మహిళ శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇది హత్య లేక ఆత్మహత్య అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలిని స్థానిక పట్టణానికి చెందిన చింత సునీతగా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం మామిండ్ల వాడకు చెందిన ముత్తోజు భాగ్య శనివారం ఉదయం తన ఇంటి ఆవరణలో ఉన్న చేదబావిలో మహిళా మృదేహాన్ని మొదట గుర్తించింది. ఈ విషయాన్ని కౌన్సిలర్ భర్త బండ నవీన్ కు తెలుపగా, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్థానికులతో కలిసి బావిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీసి చింత సునీతగా గుర్తించారు. మెడకు నలుపు రంగు చీర గుడ్డతో ఉరి వేసినట్లుగా ఉంది. ముఖంపై పెదాలపై గాయాలు ఉన్నాయి. ఈమె మొదటి భర్త చనిపోగా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి మోతే కిరణ్ తో కలిసి సహజీవనం చేస్తూ భాగ్య నివసించే సమీపంలోనే ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కిరణ్ తో సునీత ఎప్పుడు గొడవ పడుతుండేదని, సునీత భాగ్య ఇద్దరు స్నేహితులని, సునీత తరచుగా భాగ్య ఇంటికి వెళ్ళేదని, సునీతను హత్య చేసి బావిలో పడేసినట్లుగా అనుమానం ఉందని పోలీసులు తెలిపారు. కౌన్సిలర్ బండ నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించామని, ఘటనా స్థలాన్ని డాగ్ స్క్వాడ్ తో పరిశీలించామని సిఐ కరుణాకర్ తెలిపారు. స్థానిక ఏసీపీ మాధవి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

## ధరణి, భూ భారతి పోర్టల్‌లపై బీజేపీ నేత ఆరోపణలు



**చురకలు విలేకరి, ఎండపల్లి జులై 11:** తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి పోర్టల్‌లు రెండూ ఒకే తీరుగా పనిచేస్తున్నాయని బీజేపీ జిల్లా నాయకుడు మామిడిపెల్లి ప్రసాద్ ఆరోపించారు. ఈ పోర్టల్‌ల వల్ల పేద రైతుల భూములు భారీ స్థాయిలో అక్రమాలకు గురయ్యాయని, భూ యజమానులకు తెలియకుండా రికార్డుల్లో పేర్లు మార్చి అక్రమ భూ బదలాయింపులు జరిగాయని అన్నారు. ఉమ్మడి వెల్గటూర్ మండలంలో రాజకీయ పలుకుబడితో కొందరు నాయకులు తమ బంధువులు, అనుచరుల పేర్లపై భూములను బదిలీ చేయించుకున్నారని ఆరోపించారు. దీంతో అసలు భూ యజమానులు తమ భూముల వివరాల కోసం జిల్లా, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమ భూ బదలాయింపులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, భూ రికార్డులను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

**చురకలు విలేకరి, గొల్లపల్లి, జూలై 11:** గొల్లపల్లి మండలంలోని రాపల్లి గ్రామానికి చెందిన కల్లేపల్లి గౌతమి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలి భర్త కల్లేపల్లి హరీష్ 9 నెలల క్రితం ఆర్థిక ఇబ్బందులు భరించలేక గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకోగా, అప్పటినుండి మృతురాలు తన భర్త మరణం తట్టుకోలేక మానసికంగా బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు భరించలేక జీవితంపై విరక్తి చెంది శనివారం రాపల్లి లోని తన నివాసం లో వాసానికి తన చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలు తల్లి మారం పెల్లి రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్.ఐ. కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

## నాన్ క్రిమిలేయర్‌తోనే బీసీలకు న్యాయం

### -టీబీసీ జేఏ సీ రాష్ట్ర అధ్యక్షులు హరి అశోక్‌కుమార్



**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 11:** నాన్ క్రిమిలేయర్ తోనే బీసీలకు న్యాయం జరుగుతుందని టీ బీసీ జేఏ సీ రాష్ట్ర అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు. శనివారం హరి నర్సయ్య, పుప్పాల నారాయణ పటేండ్ల భవన్ లో జిల్లా టీ బీసీ జేఏ సీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన "బీసీ లకు నాన్ క్రిమిలేయర్ "పై జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు, గతంలో తెలంగాణ వెనుక బడిన సంక్షేమ శాఖ జారీ చేసిన వివరణ ఉత్తర్వుల మేరకు ఉద్యోగుల జీత భత్యాలు, వ్యవసాయ ఆదాయాలు సాధారణ క్రిమిలేయర్ పరిమితికి మించి ఉన్నప్పటికీ ఓబీసి నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ సంబందించిన తహసీల్దార్లు జారీ చేయవచ్చని, తిరస్కరించ వద్దని కోరారు.ఈ సదస్సులో రాష్ట్ర కార్యదర్శి బండారి విజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగం భాస్కర్,జిల్లా అధ్యక్షులు కొండా లక్ష్మణ్, జగిత్యాల డివిజన్ అధ్యక్షులు పుప్పాల నర్సింగారావు,యువజన అధ్యక్షులు కూసరి అనిల్ కుమార్, జగిత్యాల నియోజకవర్గం అధ్యక్షులు పంబాల రామ్ కుమార్,జిల్లా మహిళా సంఘాల నేతలు కస్తూరి శ్రీమంజరి, గంగము జలజ, సింగం పద్మ, పెన్షనర్ల జేఏ సీ జిల్లా అధ్యక్షులు పి.సి.హన్మంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు వి. ప్రకాష్, విద్యార్థి జేఏ సీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దొనూరి భూమాచారి, రైతు జేఏ సీ జిల్లా అధ్యక్షులు పుప్పాల కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పరామర్శ

**చురకలు విలేకరి, గొల్లపల్లి, జూలై 11:** గొల్లపల్లి మండలం చిల్వ కోడూర్ గ్రామానికి చెందిన ప్రముఖులు గందె శ్రీరాం రావు ఇటీవలే మృతి చెందగా వారి నివాసానికి వెళ్లి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం శ్రీరాం రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ మంత్రి వెంట మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, అశోక్ రావు, కాంపెల్లి హన్మాండ్లు, నేరెల్ల గంగారెడ్డి, కనుకుట్ల లింగారెడ్డి, అలిశెట్టి రవీందర్, ఆకుల నగేష్, బాల బత్తుల కిషన్, తొట్ల లక్ష్మీరాజం, గుర్రం మల్లయ్య, కందుకూరి రవీందర్ పాల్గొన్నారు.

# మెట్‌పల్లి గురుకులంలో పురుగుల భోజనం

### నలుగురు విద్యార్థినులకు తీవ్ర అస్వస్థత.. ప్రిన్సిపల్ పై వేటు వేయాలని తల్లిదండ్రుల ధర్నా



**చురకలు విలేకరి, మెట్ పల్లి, జూలై 11:** మెట్ పల్లి పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల అది, కారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రభుత్వ నిధులు సక్రమంగా అందుతు న్నా, విద్యార్థినులకు మాత్రం పురుగులు పట్టిన అన్నం, కుళ్లిపోయిన కూరగాయల తో వండిన విషాహారాన్ని వడ్డిస్తున్నారు. ఈ కలుషిత ఆహారం తిని ఇప్పటికే నలుగురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురికావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తమ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహంతో ఊగిపోయారు. గురుకుల పాఠశాల గేటు ఎదుట బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. పాఠశాల నిర్వహణను గాలికొదిలేసిన ప్రిన్సిపాల్ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. విద్యార్థినుల ఆరోగ్యం క్షీణిస్తున్నా పట్టించుకోని యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా ఉధృతం కావడంతో సమాచారం అందుకున్న మండల విద్యాధికారి (ఎంఈఓ) కనుకతార తక్షణమే పాఠశాలకు చేరుకున్నారు. స్టోర్ రూమ్, వంట గదిని స్వయంగా పరిశీలించారు. అక్కడ ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను చూసి ఆమె కూడా అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అనంతరం ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈఓ మాట్లాడారు.. విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదు. ఆహార నాణ్యతపై పూర్తి స్థాయి విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పాఠశాలలోని సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరిస్తామని అన్నారు. ఎంఈఓ ఇచ్చిన రాతపూర్వక హామీతో తల్లిదండ్రులు, నాయకులు తమ ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. అయితే, కేవలం హామీలతో సరిపెట్టకుండా బాధ్యులైన ప్రిన్సిపాల్, వార్డెన్లపై చర్యలు తీసుకునే వరకు తాము వదిలిపెట్టబోమని, అవసరమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తల్లిదండ్రులు హెచ్చరించారు.

### మాస్ట్రోలో అలరించిన

## స్వాగతోత్సవ వేడుకలు



**చురకలు విలేకరి, కోరుట్ల, జూలై 11:** కోరుట్ల పట్టణంలోని మాస్ట్రో జూనియర్ కళాశాలలో స్వాగతోత్సవ వేడుకలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేరళ హై స్కూల్ కరస్పాండెంట్ ఎం.ఏ. బారీతో పాటు మహదేవ్, సత్యనారాయణ, రమేష్, బిపక్, శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2025-26 విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి కళాశాలకు కీర్తి తీసుకొచ్చిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం కష్టపడి చదవాలని భవిష్యత్తులో వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి సేవ చేసే వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందం, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జనాభా నియంత్రణపై

## విద్యార్థులకు అవగాహన



**చురకలు విలేకరి, రాయికల్, జూలై 11 :** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయికల్ మండలం కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు, వైద్య సిబ్బంది ప్రజలకు కుటుంబ నియంత్రణ, మాతా-శిశు ఆరోగ్యం, మహిళా సాధికారత, సమతుల్య జనాభా పెరుగుదల అవసరంపై అవగాహన కల్పించారు. వక్తలు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్య,ఆరోగ్యం,ఉపాధి,సహజ వనరులపై ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. చిన్న కుటుంబం -- సంతోషకరమైన కుటుంబమనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయికల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్,లయన్స్ క్లబ్ సభ్యులు మ్యాకల రమేష్,కాటిపెల్లి రాంరెడ్డి,దాసరి గంగాధర్,ఆడేపు రాంప్రసాద్,ఇంజనీర్ లయన్ ఎదురుగట్ల శేఖర్, ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్,ఉపాధ్యాయులు కృష్ణహరి, బాపూరావు,సురేందర్ నరేష్,చిరంజీవి,పద్మావతి,స్వప్న,గంగాధర్,విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో క్యాచ్ ది రైన్ ప్రతిజ్ఞ కార్యక్రమం



**చురకలు విలేకరి, కోరుట్ల, జూలై 11:** జలశక్తి అభియాన్ 3.0 కార్యక్రమంలో భాగంగా కోరుట్ల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం 'క్యాచ్ ది రైన్' ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత మున్సిపల్ కమిషనర్ వి. రాఘవేంద్ర నేతృత్వంలో మున్సిపల్ అధికారులు సిబ్బంది నీటి సంరక్షణ, వర్షపు నీటి సేకరణ సుస్థిర జల నిర్వహణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ తిరుమల వసంత, కమిషనర్ వి. రాఘవేంద్ర మాట్లాడుతూ, భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరూ వర్షపు నీటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాల పెంపుదలకు సహకరించాలని, నీటి వృథాను పూర్తిగా నివారించాలని ప్రజలకు సూచించారు.

## పాఠశాల వంట గది ప్రారంభం



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, జూలై 11:** మెట్ పల్లి మండల వెల్లుల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మసాయిపేట్ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వంట గది (కిచెన్ షెడ్ )ని మండల విద్యాధికారి కనకతార తో కలిసి గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి ప్రారంభించారు. ఇజిఎస్ నిధుల తో నిర్మించిన ఈ వంటశాల నిర్మాణంతో ఎండనాక,వాననాక మధ్యాహ్న భోజనం ఇబ్బందులు తప్పాయని కార్మికురాలు ఆనందం వ్యక్తం చేశారు.స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,ఉప సర్పంచ్ రాజశేఖరరెడ్డి, స్థానిక వార్డ్ సభ్యులు రాజరెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ పాఠశాలలో నమూనా ఎన్నికలు




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 11 :** మల్యాల అల్ఫోర్స్ ఎన్ఎస్వి పాఠశాలలో శనివారం మాక్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్, లక్ష్య, ధ్రువ్ మరియు తేజస్ అనే నాలుగు హౌస్ల విద్యార్థులు తమ హౌస్ కెప్టెన్ మరియు వైస్ కెప్టెన్ ను ఎన్నుకోవడం కోసం ఓటు వేశారు. ప్రజాస్వామ్య దేశంలో నివసిస్తున్నందున, విద్యార్థులు ఎన్నికల ప్రక్రియను తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో అల్ఫోర్స్ పాఠశాలలు మరియు కళాశాలల్లో నమూనా ఎన్నికలు నిర్వహించినట్లు చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. హౌస్ ఎన్నికలలో సరస్ హౌస్ కెప్టెన్గా ఎస్.సాయి ప్రహర్షవైస్ కెప్టెన్గా టి. అశ్విత్ రెడ్డి, ధ్రువ్ హౌస్ కెప్టెన్గా ఎస్. హిమవర్షిణి, వైస్ కెప్టెన్గా ఎం. సమన్విత్ రెడ్డి, లక్ష్య హౌస్ కెప్టెన్గా జె. సాత్విక, వైస్ కెప్టెన్గా ఎస్. వరుణ్ రెడ్డి, తేజస్ హౌస్ కెప్టెన్గా ఎం.డి. సానియా, వైస్ కెప్టెన్గా కె.రిష్విక్ ఎన్నికయ్యారు. కెప్టెన్లుగా మరియు వైస్ కెప్టెన్లుగా ఎన్నికైన విద్యార్థులను చైర్మన్ నరేందర్ రెడ్డి అభినందించారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న మంత్రి అడ్లూరి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 11 :** జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవస్థాన అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. మంత్రి ముందుగా శ్రీ ఆంజనేయస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్షేత్రపాలకుడైన శ్రీ బేతాళస్వామిని కూడా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించగా,ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్, రాజేందర్ రెడ్డి, ఎస్ఐ సందీప్, ఏఎస్ఐ రమణారెడ్డి పాల్గొన్నారు.

## ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య.



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జులై 11:**జగిత్యాల జిల్లా వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిదిలోని మొక్కట్రావుపేట గ్రామానికి చెందిన మేకల గణేష్ 25 శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులుతెలిపారు. మృతుడు ఒక వారం రోజుల క్రితం తన భార్యతో కలిసి కూలీ పనుల నిమిత్తం హైదరాబాద్ కు వెళ్లి, అక్కడ పని దొరకక పోగా తిరిగి స్వస్థలం మొక్కట్రావు పేట ఇంటికి శనివారం తెల్లవారు జామున వచ్చి గణేష్ తన భార్యతో గొడవపడి, తన భార్యను పుట్టింటికి పంపించినట్లు, తనతల్లి పనులనిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్లగా ఇంట్లోని ఇనుప పైప్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి పని ముగించుకొని ఇంటికి వచ్చి చూసే సరికి తన కొడుకు చీరతో ఉరివేసు కొని మరణించినాడని, తన కొడుకు ఎక్కడ పని దొరకకపోవడంతో జీవితం పై విరక్తి చెంది ఆత్మహ త్యకు పాల్పడినట్లు తల్లి మేకల శాంతవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేపట్టి నట్లు వెల్గటూర్ ఇంచార్జి ఎస్సై రవీందర్ కుమార్ తెలిపారు.

# చినుకు పడితే చిత్తడే.. ఏళ్లుగా అదే దుస్థితి!

**-అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిన రహదారి..**
**-వర్షం వస్తే బురద రాజ్యం.. విద్యార్థులు, ప్రజలకు నరకయాతన..**
**-ప్రమాదం జరిగితేనే మేల్కొంటారా..?**
**-ప్రజల ఆవేదన ప్రధాన మార్గమే దయనీయంగా.. శాశ్వత పరిష్కారం ఎప్పుడో..?**





**చురకలు విలేకరి, కోరుట్ల, జూలై 11:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని 32వ వార్డులో ఐబీ గెస్ట్ హౌస్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా బుధవారం మార్కెట్కు వెళ్లే ప్రధాన రహదారి ఏళ్లుగా అధ్వాన్న స్థితిలో ఉంది. స్వల్ప వర్షం కురిసినా రహదారి పూర్తిగా చిత్తడిగా మారి బురదమయంగా మారుతోంది. దీంతో పాదచారులు, విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బుధవారం మార్కెట్తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది ఈ రహదారిని వినియోగిస్తుంటారు. అయితే చిన్నపాటి వర్షానికే రోడ్డు బురదతో నిండిపోవడంతో నడవడమే కష్టంగా మారుతోంది. ద్విచక్ర వాహనాలు జారిపడే ప్రమాదం కూడా నెలకొంది. స్థానికుల మాట్లాడుతూ ఈ సమస్య ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్పటికీ సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పరిస్థితి మరింత దయనీయంగా మారిందని వారు చెబుతున్నారు. విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఈ మార్గంలో నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారి బురదమయంగా మారడం పట్టణ అభివృద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి తక్షణ మరమ్మతులు చేపట్టడంతో పాటు నీరు నిల్వకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, ప్రమాదాలు జరిగే ముందే శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఘనంగా కేంద్రమంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు

**-ఘనంగా కేంద్రమంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు**




**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 11:** భారతీయ జనతా పార్టీ ధర్మపురి మండల అధ్యక్షులు, కమలాపూర్ సర్పంచ్ కుమ్మరి తిరుపతి పట్టణ శాఖ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో శనివారం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు ధర్మపురి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేకు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర నాయకులు ఒరగంటి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవన్ తిమ్మాపూర్ సర్పంచ్ పుష్పలత వైకుంఠం జిల్లా నాయకులు మంచి రాజేష్, తిరుమందాసు సత్యనారాయణ, గడ్డం శంకర్, మైధం మల్లేష్ రంగు శ్రీధర్ సంధవేని సతీష్ గంగాధరి మైపాల్ జిల్లా వినోద్ మండల ప్రధాన కార్యదర్శి కామెర ప్రభాకర్ జిల్లా వినోద్ మండల ఉపాధ్యక్షులు ఓగేటి అంజన్న పోతురాజుల తిరుపతి కార్యదర్శి ఉయ్యాల వెంకటేష్ పూదరి పవన్ కాంద్రపు రమేష్ కోల గంగాధర్ సాయికుమార్ ఉయ్యాల శివకృష్ణ కుమ్మరి వినయ్ కాసారపు అజయ్ మల్లారెడ్డి బొమ్మ కంటి పోచ మల్లు రాకేష్ మామిడిపల్లి రంజిత్ , సిరుప సంతోష్, మొగిలి మల్లేష్ వడ్లకుంట సాయి మేడి సాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు వెల్లుల్ల విద్యార్థిని ఎంపిక



**చురకలు విలేకరి, మెట్ పల్లి, జులై 11:** మెట్ పల్లి మండలంలో ఒక అద్భుతమైన క్రీడా ప్రతిభ వెలుగుచూసింది. మెదక్లో జరగనున్న ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వెల్లుల్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎంపికై సరికొత్త రికార్డు సృష్టించింది. జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోరుట్లలోని మినీ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఘనంగా నిర్వహించారు. ఇందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లుల్లకు చెందిన విద్యార్థిని మోక్ష తన అద్భుతమైన వేగంతో అందరినీ ఆకట్టుకుంది. 1000 మీటర్ల పరుగు పందెంలో మెరుపు వేగంతో దూసుకెళ్లి జిల్లాలోనే ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈ ఘన విజయంతో ఆమె రాష్ట్రస్థాయి పోటీలలో జగిత్యాల జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే అర్హత సాధించగా, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి అద్భుతమైన ప్రతిభావంతులు ఉన్నారని, రాబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా మోక్ష విజయం సాధించి జిల్లాకు వెల్లుల్ల గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మన వెల్లుల్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని మోక్ష ఇంతటి ప్రతిభ కనబరచడం పాఠశాల మొత్తానికి గర్వకారణం. సరైన పట్టుదల ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనైనా రాణించగలరని మోక్ష నిరూపించింది. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ తను పతకం సాధిస్తుందనే నమ్మకం మాకుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, స్థానిక నాయకులు పాల్గొని మోక్షకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేడు కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 11:** జగిత్యాల జిల్లాలో నూతనంగా ఏర్పాటు కానున్న కేంద్రీయ విద్యాలయం శాశ్వత భవన నిర్మాణానికి చల్ గల్ గ్రామంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నేడు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ, దివ్యాంగులు, వృద్ధులు మరియు ట్రాన్స్ ?స జెండర్ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, కోరుట్ల శాసనసభ సభ్యులు సంజయ్ కుమార్ లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి విశిష్ట అతిథిగా హాజరవుతుండగా, జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభసభ్యులు దివాకొండ దామోదర్ రావు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు జి. వంశీకృష్ణ, శాసన మండలి సభ్యులు, శాసనసభ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, కేంద్రీయ విద్యాలయ సంఘటన హైదరాబాద్ రీజియన్ ఉప కమిషనర్ సంతోష్ కుమార్ ఎస్, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొనను న్నారు. జిల్లాలో నాణ్యమైన కేంద్ర విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు జగిత్యాల జిల్లా కు ఒక మైలురాయిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# రామమందిరంలో చోరీలకు నిరసనగా "వీహెచ్" మౌనదీక్ష

## సంఘీభావం ప్రకటించిన ఎమ్మెల్యేలు కవ్వంపల్లి, ఆది



**చురకలు విలేఖరి తిమ్మాపూర్ జులై 11 :**
అయోధ్య రామమందిరం విరాళాల చోరీ వ్యవహారానికి కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యవహించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావి శనివారం మౌన దీక్ష చేపట్టారు. ఇల్లంతకుంట మండలం రామోజీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వీహెచ్ మౌన దీక్షకు పూనుకోగా, ఆయన దీక్షకు మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రాముడి పేరుతో భక్తుల నుంచి వసూలు చేసిన కోట్లాది రూపాయల విరాళాలు స్వాహా కావడం, భక్తితో ఇచ్చిన కానుకలను దొంగిలించడం వల్ల భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్ని విమర్శించారు. రామనామాన్ని నిత్యం స్మరించే కమలనాథులు రామ మందిరంలో జరిగిన చోరీలపై చోద్యం చూడటం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. "రామ మందిరం అనేది కోట్లాది హిందువుల ఆత్మగౌరవానికి, విశ్వాసానికి సంబంధించిన అంశమని, అలాంటి పవిత్ర కార్యక్రమంలో జరిగిన భారీ అవినీతిని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం దాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మతాలకు, విశ్వాసాలకు వ్యతిరేకం కాదని, మతం పేరుతో జరిగే దోపిడీని, మోసాన్ని కాంగ్రెస్ పార్టీ సహించబోదని డాక్టర్ కవ్వంపల్లి స్పష్టం చేశారు. రాముడి పేరును రాజకీయాలకు, దోపిడీకి ఉపయోగించడం కమలనాథులకు క్షంతవ్యం కాదని ఆయన పేర్కొన్నారు. కేంద్రం వెంటనే స్పందించి విరాళాల లెక్కలను బహిర్గతం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాముడు సత్యానికి, ధర్మానికి ప్రతీక అని, ఆయన పేరుతో అక్రమాలు చేస్తే ప్రజలు సహించరని స్పష్టం చేశారు.. ఈ దీక్ష ద్వారా కేంద్రానికి కనువిప్పు కలిగించాలన్నదే తమ ఉద్దేశం" అని అన్నారు. కోట్లాది మంది భక్తులు అత్యంత పవిత్రమైనదిగా భావించే అయోధ్య రామమందిరంలో నిధుల చౌర్యం వ్యవహారం భక్తులను కలవరపర్చిందన్నారు. ఏళ్ల తరబడి నిరీక్షణకు తెరదించుతూ 2024 జనవరిలో అయోధ్య రామమందిరం ప్రారంభం కాగా, కేవలం రెండున్నర ఏళ్లలోనే ఈ విధమైన ఘటనలు చోటుచేసుకోవడం భక్తులను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. దోషులకు శిక్ష పడాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, చైతన్య మహేందర్ రెడ్డి,పార్టీ నాయకులు పూట్కూరి వెంకటరమణారెడ్డి, గడ్డం నర్సయ్య, అలువాల కోటి, పసుల వెంకటి,తోపాటు వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, పార్టీ గ్రామశాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణి ఆర్జీ-1 నర్సరీలోని

# కార్మికులు పెంచిన 12 లక్షల చెట్ల మొక్కలను కాపాడండి..!

**-నర్సరీ మహిళా కాంట్రాక్టు ఉపాధి కల్పించి కార్మికులను ఆదుకోవాలి..!**

**-ఆరవ రోజుకు చేరిన నర్సరీ మహిళా కార్మికుల నిరసన దీక్ష..!**

**-కాంట్రాక్ట్ కార్మిక సంఘాల డిమాండ్ ..!**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 11:** సింగరేణి ఆర్జీ-1 నర్సరీలో విత్తనం నాటినప్పటి నుండి మొక్కలయ్యే వరకు రాత్రింబగళ్లు కష్టపడి 11 లక్షల మొక్కలను పెంచిన మహిళా కార్మికులకు ఉపాధి కల్పించి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు శనిగల శ్రీనివాస్, మద్దెల శ్రీనివాస్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నర్సరీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం నర్సరీ గేటు ముందు గత ఆరు రోజులుగా చేపట్టిన నిరసన దీక్షకు వారు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహిళా కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి పెంచిన 11 లక్షల చెట్ల మొక్కలను కాపాడాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ఈ సమస్యకు సింగరేణి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ జీఎం, డైరెక్టర్లే పూర్తి బాధ్యత వహించాలని వారు స్పష్టం చేశారు. కార్మికుల పొట్టగొట్టే విధంగా ఉన్న ప్రస్తుత టెండర్లను రద్దు చేసి, ఈ టెండర్ ప్రక్రియను వెంటనే సివిల్ యాజమాన్యానికి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరు రోజులుగా కార్మికులు దీక్షలు చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి, నర్సరీ మహిళా కార్మికులకు ఉపాధి భద్రత కల్పించి, వారి సమస్యలను పరిష్కరించకపోతే ఆర్జీవన్ ఆఫీస్ ముందు దీక్ష ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## సోమశిల ప్రాజెక్టును సందర్శించిన సీనియర్ జర్నలిస్ట్ కుటుంబ సభ్యులు.



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 11 :** కమాన్ పూర్ మండల సీనియర్ జర్నలిస్టు జబ్బార్ ఖాన్ కుటుంబ సభ్యులు నాగర్ కర్నూలు జిల్లాలోని సోమశిల ప్రాజెక్టును సందర్శించారు. అక్కడ సంగమేశ్వర ఆలయం కొల్లాపూర్ రాజా ప్యాలెస్ అమరగిరి వ్యూస్ ఎక్కువ పార్క్ మాధవ స్వామి టెంపుల్ తదితర వాటిని వీక్షించారు. అలాగే బోట్ లో షికార్ చేశారు. ఆయన వెంట కుటుంబ సభ్యులు సర్వర్ ఖాన్,సులేమాన్ ఖాన్, మతీన్ ఖాన్, ఇజాజ్ ఖాన్, షాబాజ్ ఖాన్, అల్ఫాన్ ఖాన్, తానియా, హాలియా, ఐ మాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందిని నియమించాలి



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 11:** కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వెంటనే సిబ్బందిని నియమించాలి అని పలువురు కోరుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొత్తం 26 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా కేవలం 18 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు ఇందులో కొందరు రామగుండం జి జి హెచ్ కు డిప్టేషన్ కు వెళ్లారు. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రంలో ఏపీఎమ్ఓ ఒకటి, ఎం పి హెచ్ ఎస్ (ఎం ) రెండు, సీనియర్ అసిస్టెంట్ ఒకటి, ఫార్మసిస్ట్ ఒకటి, ఎం పి హెచ్ (ఎఫ్) ఒకటి కాంటింగ్ జెంట్ వర్కర్ రెగ్యులర్ 1. ఈ స్థానాలు ఖాళీ ఉన్నాయి. 26మందికి గాను కేవలం 18 మంది మాత్రమే ఉన్నారు. ఒక్కోసారి వారు సెలవు పెడితే ఆసుపత్రిలో రోగులకు ఇబ్బందికరంగా మారడం జరుగుతుంది. అలాగే నిత్యం ఆసుపత్రికి వందలాదిమంది పేషెంట్లు రావడం జరుగుతుంది. వైద్యులను మరియు సిబ్బందిని పెంచి 100 పడకల ఆసుపత్రిగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

**వంద పడకల ఆసుపత్రిగా మార్చాలి : దామెర దేవయ్య**

కమాన్ పూర్ మండల కేంద్రంలో నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని గుండారం వార్డు సభ్యుడు దామెర దేవయ్య ప్రభుత్వాన్ని కోరారు. వైద్య పరీక్షల కోసం ఇక్కడికి చుట్టుపక్కల గ్రామాలైన గుండారం ,జూలపల్లి, పేరా పల్లి, రొంపి కుంట, నాగారం, లింగాల ,రాజాపూర్, తోపాటు సెంటినరీ కాలనీ కలవచర్ల గ్రామాల నుండి సైతం రోగులు రావడం జరుగుతుందని వెంటనే వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేయించాలని ఆయన కోరారు.

## ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన విద్యార్థిని



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 11 :** యూనివర్సల్ పాఠశాల విద్యార్థినికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందింది. పెద్దపల్లి జిల్లా, పాలకుర్తి మండలం లోని యూనివర్సల్ పాఠశాల కి చెందిన 9 వ తరగతి విద్యార్థిని డి.మహాలక్ష్మి 2026 మార్చి 20న 50 భౌతిక పరిమాణాల యూనిట్లను అత్యంత వేగంగా వ్రాసి ప్రపంచ రికార్డును సాధించింది. 13 సంవత్సరాలు 2 రోజుల వయస్సులో, ఆమె కేవలం 1 నిమిషం 48 సెకన్లలో 50 భౌతిక పరిమాణాల యూనిట్లను వ్రాసి ఈ విశిష్ట ప్రపంచ రికార్డును తన పేరిట నమోదు చేసుకుంది. ఈ ఘనత సాధించిన విద్యార్థినిని పాఠశాల కరెస్పాండెంట్ మహమూద్ ఇస్మాయిల్, ప్రధాన ఉపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## స్వామి వారిని
## దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జులై 11.** కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆదివాహ స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం శ్రీ ఆదివార స్వామిని ఆయన దర్శించుకోగా వేద పండితులు మంత్రోత్సవాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి వద్ద అభిషేకం చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అలాగే ఆలయ చైర్మన్ ముస్కాల దామోదర్, ఆలయ కార్య నిర్వహణాధికారి కొనన కాంత రెడ్డి ఆధ్వర్యంలో నరేందర్ రెడ్డిని శాలువతో సత్కరించి స్వామివారి ఫోటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు తీగల రాజయ్య, చాట్ల రాయమల్లు, కొంతం శ్రీనివాస్, బర్ల సది, బొజ్జ సతీష్, ఆలయ అర్చకులు రామానుజన్ తదితరులు పాల్గొన్నారు.



## కందకం తవ్వి..అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట



**చురకలు విలేఖరి వీణవంక జూలై 11:** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కొండపాక శివారులోని మానేరు వాగు నుండి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. శనివారం ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో వాగు దారుల్లో కందకాలు తవ్వించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## దాడి చేసిన కేసులో ఏడుగురి అరెస్ట్ రిమాండ్

చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 11 : వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన జోగుల నవీన్ ( 27 ) అనే వ్యక్తి పై దాడి చేసి గాయపరిచిన సంఘటనలో అడవి పదిర గ్రామానికి చెందిన ఏడుగురిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు వీర్నపల్లి ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఈ సంఘటనలో అడవిపదిర గ్రామానికి చెందిన సిహెచ్ ప్రదీప్ ( 28) గంగుల మహేందర్ ( 28 ) ఆత్మకూరి భూమరాజు ( 38 ) చింతలటానా శ్రీనివాస్ ( 40 ) నీలం జలెందర్ ( 29 ) జాల పెళ్లి మనో అభిషేక్ ( 22 ) గుర్రపు జాషువా ( 22 ) లను అరెస్టు చేసి రిమాండ్ చేశారు.

# బస్టాండ్ వివిధ సౌకర్యాలను ఉండే విధంగా అభివృద్ధి చేస్తా



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 11:** పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖని బస్టాండ్ అభివృద్ధి పనులను, ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు మంచినీటి సౌకర్యం తోపాటు వివిధ సౌకర్యాలను ఉండే విధంగా అభివృద్ధి చేస్తామని రామ గుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తెలపడం జరిగింది. అనంతరం స్థానిక గోదావరిఖని బస్టాండ్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ బస్టాండ్ను ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. బస్టాండ్లో ఆధునిక ప్లాట్ఫారమ్లు, ప్రత్యేక ఆటో స్టాండ్, ఆటో డ్రైవర్లకు అవసరమైన సౌకర్యాలు, ఫుట్పాత్లు, తాగునీరు, పరిశుభ్రతతో పాటు ప్రయాణికులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్టాండ్ను అభివృద్ధి చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి , డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య , సింగరేణి జనరల్ మేనేజర్, సంబంధిత శాఖల అధికారులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బూతులు మాట్లాడిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 11 : ఎల్లారెడ్డిపేట మండలం దేవుని గుట్ట తండా కు చెందిన గుగులోత్ నిఖిల్, తండ్రి భీమ్ సింగ్ ( 22 ) ఫిర్యాదు మేరకు ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై రాహుల్ రెడ్డి తెలిపారు కారులో సాయంత్రం నిఖిల్ ఎల్లారెడ్డిపేటకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా అందాద రాత్రి 08.00 గంటలకు గొల్లపల్లి గ్రామానికి చేరుకోగా అదే సమయంలో ఒక వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఫిర్యాదు కారును గుద్దగా ఎందుకు గుద్దినావని అడగగా అట్టి వ్యక్తి ఇష్టం వచ్చినట్లు బూతులు తిట్టడమే కాకుండా తనకు తెలిసిన వారికి ఫోన్ చేయగా వారు వచ్చి ఫిర్యాదిని ఇష్టం వచ్చినట్లు తిట్టి చేతులతో కొట్టినారని ఇట్టి విషయం తెలిసి ఫిర్యాది నాన్న అయిన గుగులోతు భీమ్ సింగ్ రాగా అతనిని కూడా వారు బూతులు తిట్టి చేతులతో కొట్టినారని దరఖాస్తుపై ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు

# నాపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి



**చురకలు విలేఖరి వీణవంక జులై 11:** వీణవంక మండల పరిధిలోని హిమ్మత్ నగర్ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు బొంతల రవీందర్ నా తమ్ముని మధ్య ల కొన్ని రోజులుగా భూవివాదం జరుగుతుండగా, పంచాయతీలో మాట్లాడుకుందామని పిలిచి, ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని బాధితుడు బొంతల రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. మా ఇరువురి అన్నదమ్ముల మధ్య కొన్ని రోజులుగా భూవివాదం జరుగుతుందని, తేదీ 10 జూలై శుక్రవారం ఉదయం మధ్యవర్తులు,పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకోవాలని కోరగా, గ్రామపంచాయతీ వద్దకు బైక్ వేసుకొని నేను రాగానే, నాపై ముకుమ్మడిగా గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కలిసి గ్రామస్తుల ముందు దాడి చేసి నన్ను కన్నుపై,మెడపై, తలపై తీవ్రంగా గాయపరిచారని, నాపై దాడి చేసిన దృశ్యాలు గ్రామంలోని సీసీ కెమెరాలు పూర్తిగా రికార్డ్ అయ్యాయని,నేను వెంటనే పోలీస్ స్టేషన్ కి వెళ్లి దరఖాస్తు ఇవ్వగా పోలీసు వారి సూచన మేరకు జమ్మికుంట, కరీంనగర్ ఆసుపత్రులలో వైద్య పరీక్షలు చేసుకోవడం జరిగిందని, గ్రామంలో నాపై దాడి వల్ల నా పరువు పోయిందని, నేను మానసికంగా కృంగిపోయానని, నాపై దాడి చేసిన ముగ్గురు పై చట్టపరమైన చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయగలరని పోలీసు అధికారులను వేడుకున్నారు.

## ఘనంగా కేంద్ర మంత్రి
# బండి సంజయ్కుమార్ జన్మదిన వేడుకలు



**చురకలు విలేఖరి తిమ్మాపూర్ జులై 11 :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు శనివారం రోజున తిమ్మాపూర్ మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. నుస్తులాపూర్లో కేక్ కట్ చేసి, అక్కడి వారందరికీ స్వీట్లు పంచిపెడుతూ బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. బీజేవైఎం మహాత్మా నగర్ నాయకులు దుర్శెట్టి అజయ్, ప్రేమ్ చంద్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ మృత్యుంజయ శివాలయంలో మంత్రి బండి సంజయ్ పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర్ చారి, ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కుల తిరుపతి రెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షులు గద్దం అరుణ్ పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా నాయకులు కొయ్యడ శ్రీనివాస్, గద్దం శ్రీనివాస్ రెడ్డి, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బూట్ల శ్రీనివాస్, జాడి రాజు, పుట్ట ఓం కార్, బండి స్వామి, దర్శెట్టి రమేష్, గూండ్ల రాము, వేల్పుల ఓదెలు, ధోనపాటి ప్రదీప్ రెడ్డి, కామెర వెంకటేష్, పిస్కా కృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెనుముప్పు

**-ప్లాస్టిక్ రహిత ధర్మపురి లక్ష్యంగా ముందుకు..**
**-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**



**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 11:** ప్లాస్టిక్ తో పర్యావరణానికి పెనుముప్పని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాది భూంరెడ్డి ధర్మపురి క్షేత్రంలో వివిధ అవసరాల నిమిత్తం క్లాత్ బ్యాగ్ అందించడానికి ముందుకు వచ్చారు. శనివారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్లాత్ బ్యాగులను పర్యావరణ పరిరక్షణ క్యాప్ లను ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత ధర్మపురి లక్ష్యంగా పెద్ద కొంత కాలంలో ధర్మపురి క్షేత్రంలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. ఇందులో భాగంగా స్వచ్ఛ గోదావరి... ప్లాస్టిక్ రహిత ధర్మపురి నినాదాలు ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురిని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి ఎందుకు అధికారుల సైతం ప్రత్యేక చొరవ తీసుకొని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా బండి సంజయ్

# జన్మదిన వేడుకలు



**చురకలు విలేఖరి వీణవంక జూలై 11:** బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు బత్తిని నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో వీణవంక మండలం గంగారం గ్రామంలో ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం వెయ్యి మొక్కలు నాటారు.ప్రతి కార్యకర్త కనీసం ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించాలని వారు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, నరసింహ రాజు, ఆదిరెడ్డి, గొడుగు వినోద్, సర్పంచ్లు తణుకు సంధ్య, దాట్ల వీరస్వామి, ఉపసర్పంచి హరీష్,ఉడుత కుమార్, పర్లపల్లి స్వామి, అప్పని కొమురయ్య , నల్లగోని రాజారాం, కొలిపాక శ్రీనివాస్, నాని, దాసారపు అశోక్, పాల్గొన్నారు.

### ఘనంగా కేంద్రమంత్రి

## బండి సంజయ్ జన్మదిన వేడుకలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 11 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు రేపాక రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంటు సభ్యులు కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి అలాగే మండల అధ్యక్షులు రేపాక రామచంద్ర రెడ్డి గారు, జిల్లా నాయకులు మండల నాయకులు ,కార్యకర్తలు పాల్గొని సంజయ్ అన్న నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మరింత ఎత్తుకు ఎదగాలని కోరారు.అనంతరం మండల కేంద్రంలో బిజెపి పార్టీ శ్రేణులు కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

**వృద్ధాశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్న భోజనం**

బండి సంజయ్ కుమార్ జన్మదిన పురస్కరించుకుని బిజెపి పార్టీ శ్రేణులు స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్న భోజనము పండ్లు పంపిణీ చేశారు,మహిళా మోర్చా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు బిజెపి మహిళా మోర్చా శ్రేణులు బుక్కులు పెన్నుల పంపిణీ చేశారు, ఇట్టి కార్యక్రమంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు దాసరి పూర్ణిమ. మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి దుంపెన కరస్రవంతి. మండల కార్యదర్శి చింతల లహరి. బూత్ అధ్యక్షురాలు ఫజనగంటి తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు





# కర్తవ్యనిష్ఠకు గుర్తింపు...

# శ్రీనివాస్‌కు సూపరింటెండెంట్‌గా పదోన్నతి





**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్**

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో సుదీర్ఘకాలంగా నిబద్ధతతో సేవలందిస్తున్న సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్‌కు సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించడం పట్ల దేవస్థాన వర్గాలు, ప్రజాప్రతినిధులు, భక్తులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్, హైదరాబాద్ వారు ఎల్.డిస్. నెం. బి1/10675/2026, తేదీ 07-07-2026న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఇటీవల ఖాళీగా ఏర్పడిన సూపరింటెండెంట్ పదవికి అలువాల శ్రీనివాస్‌ను పదోన్నతిపై నియమిస్తూ అనుమతి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను స్థానిక మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా ఆయన క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌కు అధికారికంగా అంద జేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ ఛైర్ పర్సన్ నాగలక్ష్మితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు, దేవస్థాన ఉద్యోగులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పాల్గొని అలువాల శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. పదోన్నతి ఉత్తర్వులు అందుకున్న అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ధర్మపురి క్షేత్రానికి చెందిన అలువాల శ్రీనివాస్ దేవస్థాన పరిపాలనలో విశేష అనుభవం కలిగిన ఉద్యోగిగా మంచి గుర్తింపు పొందారు. అనేక సంవత్సరాలుగా దేవస్థానంలో వివిధ పరిపాలనా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ అధికారుల విశ్వాసాన్ని సంపాదించారు. ఏ కార్యనిర్వహణాధికారి బాధ్యతలు చేపట్టినా వారికి పరిపాలనా పరంగా అవసరమైన సహకారం అందిస్తూ, దేవస్థాన దైనందిన వ్యవహారాలు ఎక్కడా అంతరాయం కలగకుండా ముందుండి నిర్వహించడం ఆయన ప్రత్యేకతగా చెప్పబడుతోంది. ఉత్సవాలు, బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక పూజలు, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన, కార్యాలయ నిర్వహణ, ఉద్యోగుల సమన్వయం, పరిపాలనా వ్యవహారాలు వంటి అనేక బాధ్యతలను సమర్థంగా నిర్వహించి అందరి ప్రశంసలు పొందారు.దేవస్థాన పనులను కేవలం ఉద్యోగ బాధ్యతగా కాకుండా తన ఇంటి వ్యవహారాలుగా భావించి అత్యంత అంకితభావంతో నిర్వహించడం వల్లే ఆయనకు సహోద్యోగులు, అధికారులు, అర్చకులు, భక్తుల్లో ప్రత్యేక గౌరవం ఏర్పడింది. సమస్య ఏదైనా వెంటనే స్పందించి పరిష్కార మార్గం చూపడం, ప్రజలతో సౌమ్యంగా వ్యవహరించడం, పరిపాలనలో క్రమశిక్షణ పాటించడం, సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించడం ఆయన వ్యక్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. దేవస్థాన అభివృద్ధికి అవసరమైన అనేక కార్యక్రమాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని స్థానికులు పేర్కొంటున్నారు.శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా పేరుపొందింది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఇక్కడికి తరలివస్తుంటారు. అలాంటి ప్రముఖ దేవస్థానంలో పరిపాలనా వ్యవస్థ సమర్థంగా పనిచేయాలంటే అనుభవజ్ఞులైన అధికారులు అవసరం. ఈ నేపథ్యంలో దేవస్థాన వ్యవహారాలపై సంపూర్ణ అవగాహన, అనుభవం, కార్యదీక్ష కలిగిన అలువాల శ్రీనివాస్‌కు సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించడం దేవస్థాన పరిపాలనకు మరింత బలం చేకూర్చుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ పదోన్నతి ద్వారా తనపై ఉంచిన నమ్మకాన్ని మరింత నిలబెట్టుకొని భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని అలువాల శ్రీనివాస్ అన్నారు. దేవస్థాన అభివృద్ధి, పారదర్శక పరిపాలన, భక్తులకు సౌకర్యాల విస్తరణ దిశగా మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తాననే సంకల్పాన్ని ఆయన వ్యక్తం చేసినట్లు సహోద్యోగులు తెలిపారు.అలువాల శ్రీనివాస్‌కు పదోన్నతి లభించడం పట్ల ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు, మిత్రులు, అభిమానులు, అనుచరులు, దేవస్థాన ఉద్యోగులు, స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియ జేస్తున్నారు. ఆయన అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణ, సేవా తపనకు ఈ పదోన్నతి తగిన గుర్తింపుగా నిలిచిందని వారు అభిప్రాయ పడుతున్నారు.